30112024-MAI-06_Layout 1 11/30/2024 3:41 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

లగచర్లలో రేవంత్ సర్కార్ కొత్త నాటకం

జీడిపల్లి రాంరెడ్డి
96666 80051

ఇంట గెలిచి, రచ్చ గెలవాలంటారు పెద్దలు. సీఎం రేవంత్ మాత్రం సొంత ఇంట్ల (కొడంగల్ నియోజకవర్గం)నే ఓడిపోయారు, ఇంక రచ్చల ఏం గెలుస్తారు? సొంత ఇలాఖాలో ఫార్మా విలేజి ఏర్పాటు చేయించడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యమంత్రి కదా..! ఏం చేసినా ఎదురుండదనే అత్యుత్సాహంతో రైతులపై బెదిరింపులకు దిగడం ఆయన కొంపముంచింది. తమ భూములనే తీసుకుంటూ, తమపైనే దౌర్జన్యానికి దిగడంతో అన్నదాతలు కన్నెర్ర జేశారు. ఆందోళనలు, కేసులు, అరెస్టులతో సమస్య తీవ్రస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అయితే.. ప్రభుత్వం తాజాగా ఫార్మా క్లస్టర్ కాదు, ఐటీ కారిడార్లు ఏర్పాటు చేస్తామంటూ కొత్త నాటకమాడుతున్నది. ఏదేమైనా భూములు కోల్పోయేది మాత్రం లగచర్ల రైతులే కదా?

ఫార్మా కంపెనీల విస్తరణను దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీ ఏర్పాటుచేసేందుకు పూనుకున్నది. అందుకనుగుణంగా రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 19 వేల ఎకరాల భూమి సేకరించింది. అక్కడ ఫార్మాసిటీ ఏర్పాటుచేసి ఉంటే, 20 ఏండ్లలో సుమారుగా రూ.70 వేల కోట్ల పెట్టుబడులతో పాటు 5.50 లక్షల మందికి ఉపాధి లభించేది. అప్పటికే సుమారు 400 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కంపెనీల ఏర్పాటుకు దరఖాస్తు కూడా చేసుకున్నారు. అయితే, అధికారమే పరమావధిగా బీఆర్ఎస్ సర్కార్‌పై దుష్ప్రచారం చేసిన కాంగ్రెస్ నేతలు.. ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకించారు. తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని కూడా హామీ ఇచ్చారు. చెప్పినట్టే ఫార్మాసిటీని రద్దు చేశారు కూడా.

కేసీఆర్ సర్కార్ ఏర్పాటుచేయాలని తలచిన ఫార్మాసిటీని మొదటినుంచీ వ్యతిరేకించిన కాంగ్రెస్ నేతలు.. తాము అధికారంలోకి వచ్చాక జిల్లాల్లో ఫార్మా విలేజీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం విడ్డూరం. తొలి విడతలో భాగంగా ముచ్చర్ల, వికారాబాద్, సంగారెడ్డిలలో మూడు ఫార్మా విలేజ్‌లు ఏర్పాటు చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం సొంత నియోజకవర్గం కొడంగల్‌లోని దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి గ్రామాల్లో 1,358 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. సీఎం అండదండలతో కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాల్లో రెచ్చిపోవడంతో రైతన్నలు ఎదురుతిరిగారు. పచ్చని పొలాల్లో రసాయన చిచ్చు పెట్టడంతో అన్నదాతలు ఆందోళనకు దిగారు. భూసేకరణ విషయంలో రేవంత్ సర్కార విఫలమవడంతోనే ఈ ఘటన తలెత్తింది.

ఏదైనా పదవిలో ఉన్నోడికి బరువు, బాధ్యతలేమిటో తెలుస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసీఆర్ సర్కార్ చేసిన ప్రతీ పనికి అడ్డుపడ్డ 'రేవంత్ అండ్ కో'కు ఒక పని తలపెట్టాలంటే ఎంత కష్టమో ఇప్పుడు తెలిసొచ్చి ఉంటుంది. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతో ఫార్మాసిటీని రద్దుచేసిన రేవంత్.. ఇటు ఫార్మా విలేజీ భూ సేకరణ విషయంలో విఫలమయ్యారు. దీంతో ఆయన పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర తదితర కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టుకు అడుగడుగునా అడ్డుపడ్డారు. గ్రీన్ ట్రిబ్యునల్ మొదలుకొని అన్నిరకాల కోర్టుల్లో కేసులు వేశారు. చివరికి మరణించినవారి పేరు మీద కూడా కేసులు వేయడం గమనార్హం. మల్లన్నసాగర్ విషయంలోనూ కాంగ్రెస్ ఇదే రీతిన వ్యవహరించింది. అయితే, ప్రతిపక్ష నేతలు ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్ వెనుకడుగేయకుండా ముందుకు సాగారు. ప్రాజెక్టును పూర్తిచేసి బీడు భూముల్లో గోదావరి జలాలను పారించారు. ముంపు బాధితులకు పరిహారంతో పాటు పునరావాసం విషయంలో కేసీఆర్ సర్కార్ చిత్తశుద్ధితో

వ్యవహరించడంతో ప్రజల్లో మార్పు మొదలైంది. రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్ ప్రజలు ప్రాజెక్టుకు మద్దతు పలికారు.

కేసీఆర్ ఆదేశాలతో అప్పటి మంత్రి టి.హరీశ్ రావు, రాజన్న-సిరిసిల్ల జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, సిద్దిపేట కలెక్టర్ కృష్ణభాస్కర్, అధికార యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ప్యాకేజీని పకడ్బందీగా అమలుచేయడంతో ముంపుగ్రామాల ప్రజల నుంచి అద్భుత స్పందన లభించింది. 2013 భూ సేకరణ చట్ట ప్రకారం ఒక కుటుంబానికి 75 గజాల స్థలం, ఇందిరా ఆవాస యోజన కింద సొంతిళ్లు, ఇళ్లు వద్దనుకుంటే రూ.1.50 లక్షలు మాత్రమే ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, దాని వల్ల ప్రజలు నష్టపోతారని గ్రహించిన కేసీఆర్ సర్కార్ ప్రతి కుటుంబానికి 250 గజాల ప్లాట్, డబుల్ బెడ్‌రూం ఇల్లు, ఇల్లు వద్దనుకుంటే రూ.5,04,000, అలాగే రూ.7.50 లక్షల పరిహారం ఇచ్చింది. 18 ఏండ్లు నిండినవారిని ఒక కుటుంబంగా గుర్తించి వారికి కూడా 250 గజాల ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు అందజేసింది. అంతేకాదు, ఎకరానికి రూ.6.36 లక్షల పరిహారం ఇవ్వాల్సి ఉండగా.. రూ.7.50 లక్షలు ఇచ్చింది. ఒక్క మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సుమారు 5,300 కుటుంబాలకు పరిహారంతో పాటు పునరావాసం కల్పించారు.

కేసీఆర్ సర్కార్ అందించిన ప్యాకేజీతో గతంలో అధికారులను అడ్డుకున్నవారే ఆ తర్వాత మంగళహారతులిచ్చి, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేశారు. 916 రోజుల పాటు దీక్ష చేసిన వేములఘాట్ ప్రజలు ఆ గ్రామ శివారు నుంచి అధికారులకు స్వాగతం పలికారు. ఇలా భూసేకరణ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టిన కేసీఆర్ సర్కార్ ఆ తర్వాత ప్రాజెక్టును నిర్మించి, జాతికి అంకితం చేసింది. కాంగ్రెస్, టీడీపీ, ఇతర సంఘాలు మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాటం చేశాయి. కానీ, అప్పుడు కేసీఆర్ సర్కార్ ముంపు బాధితులను ఒప్పించి ముందుకెళ్లిందే తప్ప, రేవంత్ ప్రభుత్వం లాగా దౌర్జన్యాలకు దిగలేదు.

ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు ప్రతిపక్ష పార్టీలు బాధితులకు మద్దతివ్వడం సర్వ సాధారణం. గతంలో కాంగ్రెస్ బహిరంగంగానే ఆందోళనలకు మద్దతిచ్చింది. కానీ, నాడు బీఆర్ఎస్ సర్కార్ ఎలాంటి అరాచకాలకు పాల్పడలేదు. ప్రాజెక్టుల విషయంలో కావచ్చు, తెలంగాణ అభివృద్ధి విషయంలో కావచ్చు.. ప్రతిపక్షాల కుట్రలను ప్రజామోదంతో కేసీఆర్ ఛేదించారు. అంతేతప్ప, అక్రమ కేసులు పెట్టి నిర్బంధించలేదు. ప్రజలు తిరుగుబాటు చేస్తుండటంతో ఏం చేయాలో పాలుపోక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా బీఆర్ఎస్ నేతలపై కేసులు పెడుతున్నారు. అక్రమ కేసులు పెట్టినా, అరెస్టులు చేసినా గులాబీ దళం తొణకదు, బెణకదు. అరెస్టులతో బీఆర్ఎస్‌కు మరింత మైలేజీ పెరుగుతుందే తప్ప డ్యామేజీ ఏ మాత్రం జరగదు. ఈ విషయాన్ని రేవంత్ సర్కార్ గుర్తుంచుకోవాలి.

ఉద్యమిస్తే ఉప్పెన.. విప్లవిస్తే విజయం

గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

**గతం అభివృద్ధి అస్తిత్వం..
వర్తమానం ఉద్యమం బాధ్యత..
భవిష్యత్ వికాసం
గతం వర్తమానాన్ని..
వర్తమానం భవిష్యత్తును నిర్దేశిస్తుంది**

విప్లవాల యుగం మనది విప్లవిస్తే జయం మనది. చెరసాలలు ఉరికొయ్యలు వెలుగును వంచించలేవనే నాటి పోరాట రగల్‌జెండా నినాదిలిప్పుడు తెలంగాణ దిక్కులు పిక్కటిల్లేలా వినిపిస్తున్నయి. తీవ్ర నిర్బంధాలు, చెరసాలను ఛేదించుకొని పెట్టుబడిదారుల కుట్రలను తిప్పికొట్టిన ఝార్ఖండ్ జనమిచ్చిన దిమ్మదిరిగే ప్రజాతీర్పు దేశంలోని పీడిత, తాడిత రాష్ర్టాలకిప్పుడు ఆదర్శమే కాదు, ఓ భరోసా కూడా. ప్రజా తీర్పు ముందు నిర్బంధం బలాదూరేనని, రాక్షస సామ్రాజ్యవాద పర్వతాలను ప్రజాతీర్పు కూల్చుతుందనే ఓ నమ్మకం ఏర్పడింది. బీజేపీ కుతంత్రాలు, పెట్టుబడిదారుల కుట్రలకు బలయ్యేవారికి ఝార్ఖండ్ ప్రజాతీర్పు ఓ ఆశాదీపం. ప్రజాస్వామ్య పంథాకు సరికొత్త అర్థం.

ఝార్ఖండ్‌లో ఇటీవల జరిగిన ఎన్నికలు సాధారణ ఎన్నికలే అయినా ఓ ప్రత్యేక పరిస్థితుల్లో జరిగిన ఎన్నికలుగా వాటిని చూడాలి. బలం, బలగంతో కేంద్రంలోని బీజేపీ, స్థానిక వనరులను కొల్లగొట్టేందుకు అంబానీ, అదానీ రూపంలో అనేకమంది పెట్టుబడిదారులు, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, బీజేపీ పాలిత సీఎంలంతా గిరిగీసి గిరిజనుల తీర్పును శాసించే ప్రయత్నం చేశారు. అంతకు ముందు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. హేమంత్ సోరెన్‌పై ఈడీ దాడులు చేయించి, ఆయనను జైలుపాలు చేసింది. ఝార్ఖండ్ రాష్ట్ర హక్కుల కోసం పురుడుపోసుకున్న జేఎంఎం పార్టీని నామరూపాల్లేకుండా చేసేందుకు కాంగ్రెస్ కూడా గతంలో శతవిధాలా కుట్రలు పన్నింది. హేమంత్ సోరెన్ తండ్రి శిబూ సోరెన్‌ను ముడుపుల కేసులో జైలుపాలు చేసింది. అప్పుడైనా, ఇప్పుడైనా ప్రజల కోసం జైళ్లకు వెళ్లేందుకు సోరెన్ కుటుంబం అదరలేదు, బెదరలేదు.

ప్రజాస్వామ్య పంథాలో తాజాగా ఝార్ఖండ్ ప్రజలు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకం. ఆ రాష్ట్ర ప్రజానీకం డబ్బులకు లొంగిపోకుండా వాళ్ల వివేచన, విచక్షణ పరంపరను కొనసాగించారు. కాబట్టే, ఇవాళ హేమంత్ సోరెన్ నాయకత్వంలో జేఎంఎం మరోసారి సర్కార్‌ను ఏర్పాటు చేస్తున్నది. ఈ సందర్భంగా ఝార్ఖండ్‌లోని గిరిజనుల కోసం, ప్రత్యేక రాష్ట్రం కోసం, ఆ ప్రాంత అస్తిత్వం, వనరులను కాపాడేందుకు పురుడుపోసుకున్న ఝార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ, భారత రాష్ట్ర సమితి భావ సారూప్యతలను పోల్చుకునే సందర్భం ఇది. జేఎంఎం పార్టీ నేతృత్వంలో, శిబూ సోరెన్ నాయకత్వంలో ప్రత్యేక ఝార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు కోసం మహోత్తరమైన పోరాటాలు జరిగాయి. అందుకే, జేఎంఎం పోరాటస్ఫూర్తిని అధ్యయనం చేసిన తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఉద్యమ సమయంలో అనేకసార్లు శిబూ సోరెన్‌ను తెలంగాణకు ఆహ్వానించారు. అంతేకాదు, ఝార్ఖండ్ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యాన్ని తెలంగాణ ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. స్వరాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం హోదాలో కేసీఆర్ ఝార్ఖండ్‌ను సందర్శించారు కూడా. అయితే, రాక్షస రాజ్య కుట్రలను ఎప్పటికప్పుడు ఛేదిస్తూ వస్తున్న ఝార్ఖండ్ ప్రజల పోరాట పటిమ తెలంగాణలో పునరావృతం కావాల్సిన సమయం ఆసన్నమైంది.

దేశ రాజకీయాలను ఒకసారి పరిశీలిస్తే బీజేపీ లేక కాంగ్రెస్ పార్టీలకు కేంద్రంలో కొద్దికాలం మాత్రమే ప్రజలు పూర్తిస్థాయి మెజారిటీ ఇచ్చారు. ఎక్కువ కాలం ప్రాంతీయ పార్టీల సహకారంతోనే రెండు జాతీయపార్టీలు దేశాన్ని పాలించాయి. 1980 నుంచి ఇప్పటివరకు రెండే రెండుసార్లు జాతీయపార్టీలకు పూర్తిస్థాయి మెజారిటీ వచ్చిందనేది చరిత్రను చూస్తే అవగతమవుతుంది. అంటే దేశంలో ప్రాంతీయ పార్టీలే ఆయా ప్రాంత ప్రజల అస్తిత్వ, ఆత్మగౌరవ పార్టీలని దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవాలి. కేరళ నుంచి కశ్మీర్ వరకు అనేక రాష్ర్టాల్లో ప్రాంతీయ పార్టీలే ఉన్నాయి. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ.. బీహార్‌లో ఆర్జేడీ, జేడీయూ.. తెలంగాణలో బీఆర్ఎస్.. ఝార్ఖండ్‌లో జేఎంఎం.. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ.. తమిళనాడులో డీఎంకే, అన్నాడీఎంకే.. ఒడిశాలో బీజేడీ.. ఏపీ

లో టీడీపీ, వైఎస్ఆర్సీపీ.. ఇట్లా చెప్పుకుంటే పోతే జాబితా చాలా పెద్దదే. దేశంలోని అనేక పెద్ద రాష్ర్టాల్లో ప్రాంతీయ పార్టీలే దేశంలో పెద్దన్న పాత్ర పోషిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలను లేకుండా చేసేందుకు ఎన్నోసార్లు జాతీయపార్టీ లు ప్రయత్నించాయి. కానీ, ఆయా ప్రాంతాల ప్రజలు తమ అస్తిత్వ పార్టీలను కాపాడుకున్నారు. ప్రతిసారి వాటికి ప్రాణం పోశారు. ఇది ముమ్మాటికీ సత్యం.

ఇవాళ తెలంగాణ రాష్ట్ర రాజకీయాలు, భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేస్తే ఇక్కడి అస్తిత్వ పార్టీకే మళ్లీ ప్రజలు పట్టం కడతారన్న నమ్మకం ఏర్పడింది. ఝార్ఖండ్ తీర్పుతో ఆ విషయం మరోసారి స్పష్టమైంది. కాంగ్రెస్ నాయకత్వంలోని రేవంత్ సర్కారు కొలువుదీరి ఏడాది కావస్తున్నా ఏ వర్గం సంతోషంగా లేదు. పైగా రాష్ర్టాన్ని సాధించిన కేసీఆర్‌ను నామరూపాల్లేకుండా చేస్తానని చెప్తూ.. ఆయన మీద కోపంతో బీఆర్ఎస్ సర్కార్ అమలుచేసిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తున్న తీరు, కేసీఆర్, ఆయన కుటుంబసభ్యులపై కక్షపూరితంగా వ్యవహరిస్తుండటం, అక్రమ కేసులు పెడుతుండటం, తిట్ల పురాణాలను చూసి ప్రజలు కాంగ్రెస్ సర్కార్‌ను ఈసడించుకుంటున్నారు. మన ఇంటి పార్టీ లేని లోటు, ఇంటిమనిషి లేని సందర్భం గురించి తెలంగాణ సమాజంలో చర్చ జరుగుతున్నది. రాజ్యం రూపంలో జరుగుతున్న రాక్షసత్వంపై జనంలో విసుగు వస్తున్నది. అందుకే, ఏడాదిలోపే 'ఈ పాలన ఇక చాలు' అనే మాటలు వినిపిస్తున్నాయి.

ప్రధానంగా అధికారంలోకి వచ్చేందుకు ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అటకెక్కాయి. పాలన దారితప్పింది. అంతేకాదు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను మలినం చేస్తున్న మకిలి రాజకీయాలను చూసి తెలంగాణ ఊరూ వాడా క్షోభిస్తున్నది. ఏడాదిలోనే తెలంగాణలో రైతాంగ ఉద్యమాలు పుట్టుకొస్తున్నాయి. స్వయంగా సీఎం రేవంత్ సొంత గడ్డ కొడంగల్ నుంచే భూమి కోసం, భుక్తి కోసం గిరిజనులు విముక్తి పోరాటం జరిపారు. కాంగ్రెస్ పాలకుల తీరుతో రాష్ట్రం రావణకాష్ఠంలా మండుతున్నది. నేత కార్మికుల ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యలు, విషాహారంతో విద్యార్థుల మరణాలు, ఆటో డ్రైవర్ల బలవన్మరణాలతో పాటు ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులు, కాంట్రాక్టర్లు తదితర వర్గాలు ఆందోళన బాటపడుతున్నారు. కేసీఆర్ పాలనలోని ఆలనాపాలనకు, ఇప్పటి రేవంత్ పాలనలోని అరాచకత్వాలను పోల్చుకొని ఊళ్లకూళ్లు తాము తప్పు చేశామని దుఃఖపడుతున్నాయి. ఫార్మా విలేజి కోసం బలవంతంగా తమ భూములను గుంజుకుంటున్న తీరును చూసి లగచర్ల ప్రజలు 'అనవసరంగా అందలమెక్కిస్తిమి కదా' అని కైగట్టి పాటలు పాడిన సందర్భాలను మనం చూశాం. ఓ పక్క ఏడాదిలోనే అన్ని రంగాలను విధ్వంసం చేసిన కాంగ్రెస్ వైఫల్యాలు, మరో పక్క పదే పదే కేసీఆర్‌పై తిట్ల పురాణం, సందు దొరికితే చాలు కేటీఆర్‌ను జైళ్లో వేయాలన్న ప్రతీకారం, ఉద్యమపిడుగు హరీశ్‌రావును అడ్డుకోవాలనే కసి తప్ప తెలంగాణ అంటే ప్రేమ, మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్న తపన రేవంత్ సర్కార్‌లో మచ్చుకైనా కనిపించడం లేదు.

రేవంత్ సర్కారుపై జనం కదం తొక్కుతుంటే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పీడీత తాడిత, బాధిత జనానికి అండంగా నిలుస్తున్నది. ఝార్ఖండ్‌లో వచ్చిన ఎన్నికల తిరుగుబాటు ఇప్పుడు తెలంగాణలోని అధికార కాంగ్రెస్‌పై కూడా ప్రజాక్షేత్రంలో వస్తున్నది. కేసీఆర్ పదేండ్ల పాలన, రేవంత్ ఏడాది విధ్వంసంపై సమగ్ర చర్చ గ్రామాల్లో జరుగుతున్నది. అంతెందుకు, తెలంగాణలో కాంగ్రెస్ వైఫల్యాలపై మరాఠా జనం ఆ పార్టీకి దిమ్మతిరిగే సమాధానమే ఇచ్చారు.

మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ 102 స్థానాల్లో పోటీ చేసింది. తెలంగాణ సీఎం రేవంత్ సహా మంత్రులంతా పనిగట్టుకొని ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేశారు. అయినా పట్టుమని 10 శాతం ఓట్లు కూడా కాంగ్రెస్‌కు రాలేదు. రేవంత్ 13 నియోజకవర్గాల్లో ప్రచారం చేయగా.. ఒకే ఒక్క చోట ఆ పార్టీ గెలిచింది. కాంగ్రెస్ వైఫల్యాలను అక్కడి జనం ఎండగట్టారనడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం ఏముంటుంది.

ఉద్యమాలకు ఉగ్గుపాలు పోసిన తెలంగాణ గడ్డకు చైతన్యం, పోరాటస్ఫూర్తి ఎక్కువ. అందుకే, తెలంగాణ సమాజం ఏం కోల్పోయిందో ప్రతీ ఊరూవాడా సమాలోచనలు జరుపుతున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా ఝార్ఖండ్ తరహాలోనే తీర్పు ఉంటుందన్న భావన, భరోసా తెలంగాణ సమాజంలో బలంగా ఉన్నది. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు అవసరమని, అనివార్యమని తెలంగాణ సమాజం కోరుకుంటున్నది. అందుకే, కేసీఆర్ కోసం వెయ్యి కండ్లతో ఎదురుచూస్తున్నది.

రేవంత్ సర్కారుపై జనం కదం తొక్కుతుంటే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పీడీత తాడిత, బాధిత జనానికి అండంగా నిలుస్తున్నది. ఝార్ఖండ్‌లో వచ్చిన ఎన్నికల తిరుగుబాటు ఇప్పుడు తెలంగాణలోని అధికార కాంగ్రెస్‌పై కూడా ప్రజాక్షేత్రంలో వస్తున్నది. కేసీఆర్ పదేండ్ల పాలన, రేవంత్ ఏడాది విధ్వంసంపై సమగ్ర చర్చ గ్రామాల్లో జరుగుతున్నది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

ప్రజాపాలన పేరు.. అరాచకం తీరు

కాసర్ల నాగేందర్‌రెడ్డి

ఉద్యమ నేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో వృద్ధి చెందుతూ అభివృద్ధి దిశగా దూసుకువెళ్తున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. పదేండ్ల పాటు అధికారానికిదూరమై మొహం వాచిపోయిన కాంగ్రెస్ నేతలు ఈసారి ఎట్లాగైనా గద్దెనెక్కాలని మార్పు పేరిట ప్రజలను తప్పుదోవ పట్టించారు.

అనుకున్నట్టే.. అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకున్నది. కానీ, ఎన్నో ఆశలు, ఆశయాలను మోస్తూ పీఠమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కూడా పూర్తిగా గడవకుండానే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నది. ఎంతలా అంటే.. కోరి తెచ్చుకున్న కాంగ్రెస్ సర్కార్ పేరు చెప్తేనే ప్రజలు అసహ్యించుకునేలా, ఏవగింపు వచ్చేంతలా. అందుకే, ఇప్పుడు 'వద్దురో ఈ కాంగ్రెస్ పాలన' అంటూ నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఎక్కడో ఒకచోట మాత్రమే కాదు, యావత్ రాష్ట్రవ్యాప్తంగా ఏ మూలన చూసినా ఇదే పరిస్థితి.

అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో హామీల అమలు కోసమని చెప్తూ ప్రజాపాలన పేరిట రేవంత్ హడావుడి చేశారు. అదిగో ఇస్తున్నాం, ఇదిగో ఇస్తున్నాం.. అని ప్రజలను ఊరించి లక్షల దరఖాస్తులు స్వీకరించారు. ఆ దరఖాస్తులకే అతీగతీ లేదు. సమగ్ర సర్వే అంటూ మళ్లీ వివరాల సేకరణకు తెరలేపారు. ఏడాదిగా రేవంత్ పాలన చూసి విసిగి వేసారిపోయిన ప్రజలు సర్వేకు సహకరించడం లేదు. అదేదో సినిమాలో కోట శ్రీనివాస్‌రావు చెప్పినట్టు.. 'మాకేంటి.. ఆహా చెప్తే మాకేంటి' అని సర్వే సిబ్బందిలోనే రేవంత్‌ను చూసుకుంటూ వారితో ఆటలాడుకుంటున్నారు. హామీల సంగతేంటని వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త బిచ్చగాడు పొద్దెరగడన్నట్టు సీఎం అయిన కొత్తలో తెగ హడావుడి చేసిన రేవంత్ ఇప్పుడు సొంత నియోజకవర్గం కొడంగల్ రైతులనే పట్టించుకోవడం లేదు. లగచర్లలో రక్తం ఏరులై పారుతున్నా కనీసం స్పందించడం లేదు. సీఎం సొంతూరును తమ రాజ్యంలా భావిస్తున్న సీఎం సోదరులు అక్కడ చేస్తున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. వారి వేధింపులు భరించలేక మాజీ సర్పంచ్ 'తన చావుకు సీఎం సోదరులే కారణం' అని స్పష్టంగా మరణ వాంగ్మూలం రాసి మరీ మరణించారంటేనే అక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పద్నాలుగేండ్ల పాటు సర్పంచిగా కొండారెడ్డిపల్లికి సేవలందించిన ఆ వ్యక్తి చివరి మజిలీకి బాట కూడా లేకపోవడం విచారకరం. అంతేకాదు, కలుషిత ఆహారం తిని మరణించిన గురుకుల విద్యార్థి ఆఖరి మజిలీ కూడా పోలీసు వలయం మధ్యనే సాగడం రేవంత్ సర్కార్ నిర్బంధ పాలనకు నిదర్శనం.

రేవంత్ సర్కార్ అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రం అట్టుడుకుతున్నది. హైడ్రా, మూసీ, జీవో 46 బాధితులు, బెటాలియన్ కానిస్టేబుళ్లు, ఆటోడ్రైవర్లు.. ఇలా అన్ని వర్గాలవారు ఆందోళనలు, నిరసనలు చేస్తున్నారు. ఆఖరికి మంచి బువ్వ కోసం గురుకుల విద్యార్థులు సైతం రోడ్డెక్కాల్సిన పరిస్థితి దాపురించింది. ఒక్క ఏడాదిలోనే రాష్ట్రం ఆగమాగమైపోయింది. రోమ్ నగరం తగలబడిపోతుంటే.. రోమన్ చక్రవర్తి ఫిడేల్ వాయించారట. కానీ, మన చక్రవర్తి రేవంత్‌కు ఆ ఫిడేల్ కూడా దొరకడం లేదేమో. తెలంగాణ తగలబడిపోతుంటే చూస్తూ ఉండటం తప్ప ఆయనేమీ చేయడం లేదు. రాష్ర్టాన్ని సర్వనాశనం చేయడమే కాకుండా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటు. విధ్వంసం తప్ప వికాసమే తెలియనివారు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదం. డిస్ట్రక్షన్ తప్ప కన్‌స్ట్రక్షన్ తెలియని కాంగ్రెస్ నుంచి అతిగా ఆశించడం మన తప్పే.

ఎన్నికలకు ముందు వరంగల్ డిక్లరేషన్ పేరిట మొదలైన కాంగ్రెస్ మోసాల పర్వం మొన్నటి వరంగల్ సభ వరకు నిరాటంకంగా సాగుతూనే ఉన్నది. విజయోత్సవాల పేరిట సభ పెట్టి చెప్పుకోవడానికి ఏమీ లేకపోవడంతో రేవంత్ మళ్లీ పాత పాటే అందుకున్నారు. నిమిషానికోసారి కేసీఆర్, కేటీఆర్‌లను తల్చుకున్నారు. పల్లెల నుంచి రాజధాని హైదరాబాద్ దాకా అడుగడుగునా కేసీఆర్ ఆనవాళ్లే కనిపిస్తుండటంతో రేవంత్‌కు నిద్ర పట్టడం లేదనుకుంటా. అందుకే, కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని పదే పదే ఆయనను తలుచుకుంటున్నారు. నిమిషానికోసారి కేసీఆర్ జపం చేస్తూ ఆనవాళ్లు లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదం. అయినా అబద్ధాల పునాదులపై నిర్మించిన కోట ఎంతోకాలం నిలవదు. అది ఏదో ఒకరోజు కుప్పకూలాల్సిందే. కేసీఆర్, కేటీఆర్‌లపై చేసే దుష్ప్రచారం కూడా అంతే. కాంగ్రెస్ నాయకుల మాయమాటలను ప్రజలు ఒకసారి నమ్మి ఓట్లు వేశారు. అవే మాయమాటలు చెప్పి మళ్లీ మోసం చేయాలనుకోవడం కాంగ్రెస్ నేతల మూర్ఖత్వమే.

నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచిన రేవంత్.. అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ఖజానాకు గండి కొట్టి తన సొంత ఖజానా నింపుకొనేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు అనేక స్కాములు బయటపడ్డాయి. కేటీఆర్ చెప్పినట్టు.. అదానీ, అన్న, తమ్ముడు, అల్లుడి కోసమే రేవంత్ సర్కార్ నడుస్తున్నది. సీఎం సోదరుడు జగదీశ్వర్‌రెడ్డికి చెందిన ఊరు, పేరు లేని స్వచ్ఛ బయో కంపెనీ రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్టు ప్రచారం చేసి తెలంగాణ సొమ్మును సోదరుడికి ధారాదత్తం చేశారు. బామ్మర్ది సృజన్‌రెడ్డికి రూ.1,137 కోట్ల విలువైన అమృత్ కాంట్రాక్టును కట్టబెట్టారు. అన్నాదమ్ముళ్లకు కొడంగల్‌ను రాసిచ్చేశారు. ఇప్పుడు అల్లుడికి లబ్ధి చేకూర్చేందుకు ఫార్మా విలేజ్ పేరిట లగచర్లలో రక్తపాతం సృష్టిస్తున్నారు.

ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చిన ప్రతీసారి ఏదో ఒకవిధంగా డైవర్షన్ రాజకీయాలకు తెరలేపుతూ కాంగ్రెస్ పాలకులు పబ్బం గడుపుకొంటున్నారు. అయితే, ఈ డైవర్షన్ పాలిటిక్స్ ఎంతోకాలం సాగవు. ఏదో ఒక రోజు వాటికి తెరదించక తప్పదు. ప్రజలిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వం పూటకో స్టంట్ వేస్తూ పొద్దు గడుపుతున్నది. ఇప్పటికైనా రేవంత్ తన తీరును మార్చుకోకపోతే 'పాలకుడు ఇలా ఉండకూడదు' అన్నదానికి ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోవడం ఖాయం.

(వ్యాసకర్త: అధ్యక్షులు, బీఆర్ఎస్ ఆస్ట్రేలియా)

ఢిల్లీని నడిపిస్తున్న గ్యాంగ్‌స్టర్లు!

ఢిల్లీ పాలన సగం కేంద్రం చేతుల్లోనే ఉంటుంది. ఢిల్లీలో శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిదే. కానీ, ఢిల్లీలో అవి పూర్తిగా క్షీణించాయి. ముఖ్యంగా అమిత్ షా కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇదే తంతు. నిత్యం ఎక్కడో ఒకచోట కాల్పుల ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇదంతా చూస్తుంటే ఢిల్లీని గ్యాంగ్‌స్టర్లు నడిపిస్తున్నారని అనిపిస్తున్నది.

-అరవింద్ కేజ్రీవాల్, ఢిల్లీ మాజీ సీఎం